క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



రాంబాబును పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: నిద్దాం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, విశ్రాంత వైద్యుడు డాక్టర్ మీసాల రాంబాబు ఇటీవల కంటి చికిత్స చేయించుకోవడంతో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. వైస్ ఎంపీపీ మీసాల సాధ్వీమణి, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎర్నేన ప్రకాశరావు ఉన్నారు.

జి.సిగడాంలో వైద్య శిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీరామమూర్తి

జి.సిగడాం : సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా జి.సిగడాం మండల కేంద్రంలోని సత్యసాయి మందిరం వద్ద మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కమిటీ సభ్యులు, మండల ఆర్‌ఎంపీ వైద్యులు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయనగరం శ్రీ సాయి సూపర్‌స్పెషలిటీ ఆస్పత్రి ఎండీ, డాక్టర్ ఎం.శ్రీరామమూర్తి సమక్షంలో సుమారు 250 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

వావిలపల్లికి అభినందనలు



శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక సభ్యులు వావిలపల్లి రాజారావుకు తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో అన్నమయ్య కీర్తనలపై ప్రసంగించేందుకు ఆహ్వానం లభించింది. ఈ సందర్భంగా తెరవే సభ్యులు సభ్యులు బలివాడ మల్లేశ్వరరావు, సురంగి మోహనరావు, యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి, వాండ్రంగి కొండలరావు, కోమలరావు తదితరులు మంగళవారం హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

విత్తనబంతుల తయారీలో రికార్డు



అవార్డు అందుకుంటున్న సిస్టర్ రోజ్

శ్రీకాకుళం కల్చరల్: ప్రకృతి వ్యవసాయానికి తమ వంతు సాయంగా నగరానికి చెందిన సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థులు 1,92,782 విత్తన బంతులను గంట వ్యవధిలో తయారుచేసి రికార్డు సృష్టించారు. సెయింట్ జోసెఫ్ అన్నెసీ సంస్థ 375వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 11న 1400 మంది విద్యార్థులతో ఈ రికార్డు సాధించారు. వరల్డ్ రికార్డు యూనియన్ ప్రతినిధులు ఆన్‌లైన్‌ద్వారా పరిశీలించి రికార్డును ధ్రువీకరించి ఇటీవల విశాఖలో జరిగిన కార్యక్రమంలో ప్రావిన్షియల్ సిస్టర్ రోజ్‌కు అవార్డు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కరస్పాండెంట్ జోసెఫ్‌న్ మేరీ, స్వర్ణ జేవియర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

25న బాలు వర్ధంతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళా మందిర్‌లో ఈ నెల 25న సాయంత్రం 5.30గంటలకు సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జి.బి.ఏ. స్వరమాధురి వెల్ఫేర్ సర్వీస్ సొసైటీ నిర్వాహకులు పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, ఎం.వి.కామేశ్వరరావు మంగళవారం తెలిపారు. బండారు రమణమూర్తి సంగీత సారథ్యంలో సినీ సంగీత నీరాజనం కార్యక్రమంలో భాగంగా పలు సినీ నేపథ్య గీతాలాపనలు ఉంటాయని, అభిమానులంతా పాల్గొనాలని కోరారు.

తూకాల్లో తేడాలొస్తే కాటాలు సీజ్



చేపల మార్కెట్‌లో కాటాలను తనిఖీచేస్తున్న అధికారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా కేంద్రంలోని ఏసీబీ కార్యాలయం పక్కన చేపల మార్కెట్‌లో తూకాల్లో భారీ తేడాలు జరుగుతున్నాయని కొనుగోలుదారులు ఫిర్యాదుచేయడంతో తూనికలు కొలతలు అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. పలు కాటాలను సీజ్ చేశారు. నగరంలో పండ్లు దుకాణాలు, చేపల దుకాణదారులు 10మందిపై కేసులు నమోదుచేసినట్లు అసిస్టెంట్ కంట్రోలర్ బాలరామకృష్ణ తెలిపారు. తూకాల్లో తేడాలు వస్తే సహించేది లేదని, మరోసారి ఇటువంటి ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దారులిలా..వెళ్లేదెలా?

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- రాళ్లు తేలి, గోతులు ఏర్పడటంతో నరకయాతన
- కూటమి పాలన ఏడాదిన్నర కావస్తున్నా పట్టించుకోని పాలకులు



గొంటి రోడ్డు నుంచి మెండపేటకు వెళ్లే బీటీ రోడ్డులో ఏర్పడిన భారీ గుంతలు

గార : తమ ప్రభుత్వం వస్తే రోడ్లను అద్దాల్లా మార్చేస్తామని ఊదరగొట్టిన కూటమి నాయకులు ఇప్పుడు చేతులెత్తేశారు. ప్రభుత్వం రహదారుల బాగోగులు పట్టించుకోకపోవడంతో పల్లె రోడ్లు దారుణంగా తయారయ్యాయి. ఎక్కడికక్కడ రాళ్లు తేలి, గోతులు ఏర్పడటంతో వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా ఇప్పటికీ పనులు చేపట్టకపోవడంపై గ్రామీణ ప్రజలు మండిపడుతున్నారు.

– గార మండలం దీపావళి రోడ్డు నుంచి అర్బన్ హౌసింగ్ కాలనీ, మెండపేట తదితర గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డులో గుంతలు ఏర్పడటంతో వర్షపు నీరు రోజుల తరబడి నిలిచిపోతోంది. అడుగుకో గొయ్యి ఏర్పడటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళ గోతుల్లో పడిపోయి గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయి. బైక్‌లు పంక్చర్లు పడి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కళింగపట్నం–శ్రీకాకుళం పధాన రహదారి నుంచి కొత్తూరు– సైరిగాం వెళ్లే బీటీ రోడ్డులో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే గొండు శంకర్ త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పినా ఇంత వరకు మోక్షం కలగలేదు. కిలోమీటరు పైబడి ఉన్న రహదారే ఈ గ్రామానికి ఆధారం.
- వత్సవలస పంచాయతీ ఎర్రగుడ్డి గ్రామస్తులకు గ్రావెల్ రోడ్డే ఆధారం కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో రహదారి బురదమయంగా మారడంతో కనీసం నడిచి వెళ్లేందుకు కూడా అవస్థలు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.
- శ్రీకూర్మం పంచాయతీలోని చీడిపేటకు రహదారి నిర్మిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినా ఇంతవరకు పనులు ప్రారంభించకపోవడంతో అధికారులు, పాలకుల తీరుపై గ్రామస్తులు మండిపడుతున్నారు.

రాళ్లు తేలాయి



బీటీ రోడ్డు మొత్తం రాళ్లు తేలిపోయింది. బైక్‌లు, సైకిళ్లు పాడైపోతున్నాయి. రోడ్డు పనులు చేస్తామని నాయకులు చెప్పినా నిధులు మంజూరు చేయకుండా తాత్సారం చేస్తున్నారు.

– ఆరంగి సూర్య, కె.సైరిగాం

అడుగుకో గుంత



రహదారిలో అడుగుకో గుంత ఉండటంతో వర్షాలు సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డులోనే గ్రామంతో పాటు అర్బన్ కాలనీ ఉన్నా రోడ్డు పనులకు చర్యలు తీసుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– మెండ నరేష్, మెండపేట

ప్రయాణిస్తే తెలుస్తుంది..



మా గ్రామ బీటీ రోడ్డులో అధికారులు, ప్రజాప్రతినిధులు ఒకసారి ప్రయాణించి చూస్తే మా ఇబ్బందులు తెలుస్తాయి. చిన్న గోతులున్నప్పుడు వదిలేయడంతో ఇప్పుడు భారీగా గొయ్యిలు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– మెండ శ్రీను, మెండపేట



కె.సైరిగాం రోడ్డులో ఏర్పడిన గోతులు



రాళ్లు తేలిన సైరిగాం బీటీ రోడ్డు

క్షయ వ్యాధిపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి డాక్టర్ ప్రశాంత్

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్–7 ప్రోగ్రామ్ అధికారి టి. భవానీ ఆధ్వర్యంలో నిక్షయమిత్ర స్వచ్ఛాంధ్ర నమోదు కార్యక్రమం చేపట్టారు. క్షయ రోగులకు మానసిక, సామాజిక సహకారం అందించడం, వారికి మనోధైర్యం అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని, సమాజంలో అన్ని వర్గాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి టీబీ రోగులకు మద్దతుగా నిలవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి డాక్టర్ ప్రశాంత్, రాష్ట్ర టీబీ కన్సల్టెంట్ మనోహారరెడ్డి, జిల్లా టీబీ పొగ్రాం అధికారి పి.శ్రీనివాస్, డీపీపీఎం కో–ఆర్డినేటర్ దివాకరరావు, పార్వతీపురం మన్యం జిల్లా డీపీఎస్ ఆర్.సాహూ, వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డి.వనజ, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : స్థానిక రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ముక్తభారత్ అభియాన్ కార్యమం చేపట్టారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకూ స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా క్షయ రోగులకు మానసిక, సామాజిక సహకారం అందించడానికి, విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో డైరెక్టర్ బాలాజీ, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, వాసు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ ప్రశాంత్, రాష్ట్ర టీబీ కన్సల్టెంట్ మనోహారరెడ్డి, జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి పి.శ్రీనివాస్, డీపీపీఎం కో–ఆర్డినేటర్ దివాకరరావు, ఆర్.సాహూ, పెద్దింటి ముకుందరావు, బి.శ్రీధర్, పి.గాయిత్రి, క్యాంపస్–2 ఇన్‌చార్జ్ సాగర్, పీఆర్‌వో మామిడి షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవత ఉత్సవం



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

జి.సిగడాం : పెంట గ్రామంలో మంగళవారం చెవిటిపోలమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

రాజ్‌కుమార్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజ్‌కుమార్

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన రేజేటి రాజ్‌కుమార్ పూణేలో జరిగిన నవసాన్వద్ ఫౌండేషన్ తరఫున నవోదయన్–2025 అవార్డు అందుకున్నారు. నవోదయ పూర్వ విద్యార్థిగా ఆర్ట్ అండ్ కల్చర్ కేటగిరీలో ఈ అవార్డుకు తనను ఎంపికచేసినట్లు రాజ్‌కుమార్ తెలిపారు.

పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పాడి రైతులు

రణస్థలం: చలో విశాఖ డెయిరీ కార్యక్రమం విజయవంతం చేయాలని పాల రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్లె ప్రసాదరావు, లంక నారాయణరావు పిలుపునిచ్చారు. రావాడ, కృష్ణాపురం గ్రామాల్లో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ డెయిరీలో జరిగిన అవినీతిపై వేసిన హౌస్ కమిటీ విచారణ పూర్తి చేసి దోషులను శిక్షించాలని, డైరీ ఆస్తులను కాపాడాలని, పాల రైతులకు పాల సేకరణ ధరలు పెంచాలని, ప్రతి మూడు నెలలకు బోనస్ ఇవ్వాలని, చనిపోయిన రైతు కుటుంబానికి పరిహారం చెల్లించాలని, పశువులకు ఉచిత బీమా, మందులు ఇవ్వాలని, దాణాపై 75శాతం రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాడి రైతులు గంట్యాడ అప్పలసూరి, రెడ్డి సత్యం, పిల్ల సురేష్, గురునాయుడు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!

- నగరంలో రోడ్డుపైనే చెత్త డబ్బాలు
- రాత్రివేళ కనిపించక తరచూ ప్రమాదాలు
- నిర్వహణకు నోచుకోని పలు డస్ట్ బిన్లు



శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డుపై చెత్త సేకరణ డబ్బా

శ్రీకాకుళం : చెత్త సేకరణకు ఉద్దేశించిన డస్ట్‌బిన్లు పలుచోట్ల ప్రమాదకరంగా మారాయి. రహదారి పక్కన కాకుండా రోడ్డుపైనే వీటిని వదిలేయడంతో రాత్రివేళ వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నగరంలో 50 శాతానికి పైగా ప్రాంతాల్లో వీధి లైట్లను రాత్రి పది గంటల తర్వాత ఆపేస్తున్నారు. గాఢమైన చీకట్లో ఈ డస్ట్‌బిన్లు కనిపించక పలువురు క్షతగాత్రులుగా మారుతున్నారు. మరోవైపు ఈ డబ్బాల వద్దకు ఆవులు, కుక్కలు చేరి చిందరవందరంగా చేసేస్తూ రాకపోకలకు మరింత ఆటంకాన్ని కలిగిస్తున్నాయి.

నిధుల్లేవ్..!

నగరపాలక సంస్థ వద్ద నిధులు లేకపోవడంతో కొత్త డస్ట్ బిన్లు కొనుగోలుకు మోక్షం కలగడం లేదు. పాడైపోయినవి మరమ్మతులకు నోచుకోవడం లేదు. రథసప్తమి పండుగను రాష్ట్ర పండుగగా చేయకపోయినా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు రావడం పరిపాటి. అటువంటి దానిని రాష్ట్ర పండుగగా జిల్లాలోని ప్రజాప్రతినిధులు ప్రకటించారు. దీనికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుందేమోనని అందరూ భావించారు. అభివృద్ధి పనులు, సుందరీకరణ పనులు చేయించాలని ప్రజాప్రతినిధులు ఆదేశించడంతో నగరపాలక సంస్థ నిధులతో పనులన్నీ చేయించేశారు. నగరపాలక సంస్థ సాధారణ నిధులన్నీ అప్పుడే ఖర్చయిపోయాయి. ప్రభుత్వం మంజూరు చేస్తే ఆ నిధులను సాధారణ నిధులకు మళ్లించవచ్చని నగరపాలక సంస్థ అధికారులు భావించారు. తాజాగా నిధులేవీ రాష్ట్రస్థాయి నుంచి రావని తెలియడంతో కక్కలేక మింగలేక మౌనం వహిస్తున్నారు. అధికారులు ఎక్కడికి వెళ్లినా సమస్యలపై ప్రజలు నిలదీస్తుండటంతో వారికి సమాధానం చెప్పలేక మౌనం వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం నగరపాలక సంస్థకు నిధులు కేటాయించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సమస్య గుర్తించాం

డస్ట్ బిన్లు రోడ్డు మధ్యలో ఉంటున్న విషయాన్ని గమనించాం. ఇటీవలే వాటిని పక్కకు జరపాలని నిశ్చయించాం. డస్ట్ బిన్లు పెట్టేందుకు తారు రోడ్డు గాని సిమెంట్ రోడ్డు గాని అవసరం. ఈ కారణంగానే రోడ్డు మధ్యలో ఉంచాం. త్వరలోనే రోడ్డు పక్కన ఉన్న మట్టి రోడ్డుపై వీటిని ఏర్పాటు చేసేందుకు ప్లాట్‌ఫామ్ నిర్మిస్తాం. డస్ట్ బిన్లకు కూడా త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం.

– ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ



జీటీ రోడ్డులో చక్రాలు కూడా లేకుండా రోడ్డు మధ్యలో ఉన్న డస్ట్ బిన్



అరసవల్లి మిల్లు జంక్షన్ సమీపంలో చెత్త డబ్బా వద్ద ఆవులు

• దేవీ వైభవం



నానుబాలవీధిలో విజయదుర్గ అమ్మవారు



మొండేటివీధిలో గాయత్రీమాతగా లలితాదేవి



సంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజలు



పీఎన్‌కాలనీ పార్కులో కోలాటం బృందం



ఉమాజఠలేశ్వరాలయంలో ఉమాదేవికి పసుపు కొమ్ములతో పూజ



సత్యసాయి పెద్దమందిరంలో సామూహిక కుంకుమ పూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు మంగళవారం విజయదుర్గ, గాయత్రీమాత అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష పూజలు అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మండపాల వద్దకు భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

శంకరరావుకు సంగీత కళా నందీశ్వర అవార్డు



అవార్డు అందుకుంటున్న శంకరరావు

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన నాదస్వర వాద్య కళాకారుడు కుర్మాపు శంకరరావుకు 'సంగీత కళా నందీశ్వర' అవార్డుతో సత్కరించారు. విజయవాడలో తిరుపతికి చెందిన శ్రీవాగ్దేవి విద్యా సంగీత, కళా నృత్య సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కచేరిలో ప్రదర్శన ఇచ్చినందుకు గాను 'స్వర సప్త సంగీత విద్యా నృత్యసమ్మేళనం–2025 సంగీత కళా నందీశ్వర అవార్డును ఎస్.వి.మ్యూజిక్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, రాళ్లపాటి సీతారాములు చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈయన ప్రస్తుతం పాండ్రంగివీధిలోని లలితాదేవి పీఠంలో ఆస్థాన విద్వాంసునిగా ఉన్నారు. వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

అంతర పంటలపై ఆసక్తి



కుప్పిలిలో అంతర పంటల సాగు

ఎచ్చెర్ల : వర్షాధార ప్రాంతాల రైతులు అంతర పంటలపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. కుప్పిలి, అజ్జరాం, ఎచ్చెర్ల వంటి గ్రామాల్లో ఇటువంటి పంటలు అధికంగా దర్శనమిస్తున్నాయి. కొబ్బరి, అరటి, మిరప, బెండ, మున వంటి పంటలు ఒకే చోట అంతరపంటగా వేస్తున్నారు. దీనివల్ల తక్కువ పెట్టుబడి, తక్కువ సాగునీటితో పలు రకాల పంటలు చేతికి అందివస్తున్నాయని రైతులు అంటున్నారు. ఒక పంట పోయినా మరోపంట నష్టపోవాల్సిన అవసరం ఉండదని చెబుతున్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

ఆమదాలవలస: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని సత్యసాయి సేవా సంస్థల విద్యాజ్యోతి రాష్ట్ర ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ గురుప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సత్యసాయి యువ వికాస్ కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ ఎస్ఎన్ స్వామి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.